సందేశం టైమ్స్
జాతీయ తెలుగు దిన పత్రిక
సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి జిల్లాల నియోజకవర్గాల ఇన్చార్జిలు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించండి.
శెట్టి వెంకటేష్ గౌడ్ సీఈవో
సెల్ నెంబర్ : 9052045 435,9542522611.

జాతీయ తెలుగు దినపత్రిక RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు




ఆదివారం 19 ఏప్రిల్ 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 321 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్

## బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలి సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర ఉక్కు శాఖ మంత్రికి విజ్ఞప్తి



సందేశం టైమ్స్, ఢిల్లీ, ఏప్రిల్ 19, ప్రతినిధి: తెలంగాణలో పారిశ్రామిక అభివృద్ధి, గ్రీన్ టెక్నాలజీ ఆధారిత ఉక్కు ఉత్పత్తిని ప్రోత్సహించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామిని కలిసి బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో జరిగిన ఈ సమావేశంలో తెలంగాణ రైజింగ్–2047 విజన్‌లో భాగంగా రూపొందించిన పారిశ్రామిక ప్రతిపాదనలను కేంద్ర మంత్రులకు వివరించిన సీఎం, గ్రీన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు వల్ల ఉక్కు కొరత తగ్గడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు మేలు జరుగుతుందని తెలిపారు. అలాగే పాత వాహనాల స్క్రాప్ ఆధారంగా ఉక్కు రీసైక్లింగ్ పరిశ్రమ ఏర్పాటు చేయాలని, హైడ్రోజన్ టెక్నాలజీతో గ్రీన్ స్టీల్ క్లస్టర్, ఆటోమొబైల్, రక్షణ రంగాలకు అవసరమైన ఉత్పత్తుల తయారీ పరిశ్రమలు, ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీ తయారీ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. మెషిన్ టూల్స్, రోబోటిక్స్ వంటి ఆధునిక పరికరాల తయారీకి ప్రత్యేక పార్క్ ఏర్పాటు చేయాలని సూచించిన సీఎం, హైదరాబాద్‌ను 2034 నాటికి కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దే లక్ష్యాన్ని వివరించారు. ఆధునిక పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాల కోసం జాతీయ స్థాయి శిక్షణ సంస్థలను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రులకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, కేంద్ర ప్రాజెక్టుల సమన్వయ ప్రత్యేక కార్యదర్శి అద్వైత్ కుమార్ సింగ్ పాల్గొన్నారు.



## రాష్ట్రవ్యాప్తంగా ఏప్రిల్ 20 నుంచి 26 వరకు “సంక్షేమ వారం” నిర్వహణ – సీఎస్ రామకృష్ణారావు సమీక్ష

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 19, ప్రతినిధి: 99 రోజుల ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఏప్రిల్ 20 నుంచి 26 వరకు “సంక్షేమ వారం”ను సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఆదేశించారు. సచివాలయం నుండి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించిన ఆయన, సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలు, విద్యా సంస్థల్లో సేవల మెరుగుదల, విద్యార్థుల భాగస్వామ్యం, ప్రజల అవగాహన పెంపొందించడమే లక్ష్యమని తెలిపారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్ రోజువారీ కార్యక్రమాల షెడ్యూల్‌ను వివరించగా, ఏప్రిల్ 20న అన్ని విద్యాసంస్థల్లో వంటగది–పారిశుద్ధ్య తనిఖీలు, 21న టాలెంట్ ఫెస్ట్‌లో క్విజ్, డిబేట్, చిత్రలేఖనం పోటీలు, 22న హాస్టళ్ల మరమ్మతుల గుర్తింపు, 23న తల్లిదండ్రులు–ఉపాధ్యాయుల సమావేశాలు, 24న నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, 25న వేసవి శిబిరాలు, 26న బడిబాట కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. ప్రతి కార్యక్రమాన్ని కలెక్టర్లు పర్యవేక్షించి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ప్రణాళిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం పెంచాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, సీఐపీఆర్ చి. ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా ఇర్రమ్ మంజిల్‌లో స్వచ్ఛత కార్యక్రమం – వారసత్వ పరిరక్షణపై ప్రత్యేక అవగాహన





సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 19, ప్రతినిధి: ప్రపంచ వారసత్వ దినోత్సవం 2026 సందర్భంగా క్వలీ కుతుబ్ షాహీ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (QQSUDA) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని చారిత్రక ఇర్రమ్ మంజిల్ ప్యాలెస్‌లో స్వచ్ఛత కార్యక్రమం, ట్రెజర్ హంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రోడ్లు మరియు భవనాల శాఖ, డెక్కన్ ఆర్కైవ్ సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో స్పెషల్ సీఎస్ (MA&UD) జయేశ్ రంజన్ పాల్గొని మాట్లాడుతూ ఈ చారిత్రక స్థలం పరిరక్షణకు ఎంతో ప్రాముఖ్యత ఉందని, తెలంగాణ ప్రభుత్వం తీసుకురాబోయే హెరిటేజ్ పార్ట్నర్ స్కీమ్ ద్వారా దీనిని పునరుద్ధరించి సద్వినియోగం చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న 60 మందికి పైగా వాలంటీర్లను ఆయన అభినందిస్తూ వారిని హెరిటేజ్ అంబాసిడర్లుగా కొనసాగాలని ఆహ్వానించారు. 19వ శతాబ్దం చివరలో నిజాం పరిపాలనలో సాలార్‌జంగ్ కుటుంబానికి చెందిన నవాబ్ ఫఖ్రుల్ ముల్క్ నిర్మించిన ఇర్రమ్ మంజిల్ ఒకప్పుడు విస్తృత తోటలు, మార్గాలు, వందల గదులతో ఉన్న మహల్‌గా ఉండేదని, స్వాతంత్ర్యానంతరం ప్రభుత్వ కార్యాలయాలుగా ఉపయోగించబడిందని, ప్రస్తుతం చాలా భాగం నిరుపయోగంగా ఉన్నప్పటికీ దాని వాస్తుశిల్ప వైభవం ఇప్పటికీ ఆకర్షణీయంగా ఉందని అధికారులు తెలిపారు. QQSUDA అడ్మినిస్ట్రేటర్ గౌతమి పి మాట్లాడుతూ వారసత్వ పరిరక్షణకు సమిష్టి సహకారం అవసరమని, ప్రతి నెలా అవగాహన కార్యక్రమాలతో వార్షిక క్యాలెండర్ రూపొందించనున్నట్లు ప్రకటించారు.



## తెలంగాణలో ఎయిర్‌పోర్ట్ ప్రాజెక్టులు వేగవంతం చేయాలి – మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమీక్ష

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 19, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్రాన్ని సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లే లక్ష్యంతో వరంగల్, ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ప్రతిపాదిత విమానాశ్రయాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం సచివాలయంలో ఎయిర్‌పోర్ట్ అథారిటీ సదరన్ రీజియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజ్ కిషోర్, ఏవియేషన్ డైరెక్టర్ భరత్ రెడ్డి తదితరులతో నిర్వహించిన సమీక్షలో మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటూ అభివృద్ధి ప్రాజెక్టులను వేగంగా ముందుకు తీసుకెళ్తోందని తెలిపారు. వరంగల్ ఎయిర్‌పోర్ట్‌కు సంబంధించి ఇప్పటికే సుమారు 953 ఎకరాల భూమి సేకరించి కేంద్రానికి అప్పగించినట్లు ఆయన వెల్లడించారు. వీలైనంత త్వరలో శంకుస్థాపన చేయాలని సూచించారు. ఆదిలాబాద్ విమానాశ్రయాన్ని డిఫెన్స్ మరియు సివిల్ ఏవియేషన్ శాఖలతో కలిసి అభివృద్ధి చేయాలని నిర్ణయించగా, మాస్టర్ ప్లాన్ తక్షణమే సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే ఉత్తర తెలంగాణలో రవాణా సౌకర్యాలు గణనీయంగా మెరుగుపడతాయని ఆయన పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రతిపాదిత స్థలం అనుకూలం కాదని కేంద్రం సూచించిన నేపథ్యంలో, ప్రత్యామ్నాయ స్థలాలపై సమగ్ర అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

## రాష్ట్రవ్యాప్తంగా ఏప్రిల్ 20 నుంచి 26 వరకు “వెల్ఫేర్ వీక్” – సీఎస్ రామకృష్ణారావు సమీక్ష, రోజువారీ కార్యాచరణ విడుదల




సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 19, ప్రతినిధి: 99 రోజుల ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక అమలులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఏప్రిల్ 20 నుంచి 26 వరకు “వెల్ఫేర్ వీక్”ను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఆదేశించారు. శనివారం సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన సమీక్ష నిర్వహించగా, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్ రోజువారీ కార్యక్రమాల షెడ్యూల్‌ను వివరించారు. ఏప్రిల్ 20న అన్ని వెల్ఫేర్ విద్యాసంస్థల్లో వంటశాలలు, పారిశుద్ధ్యంపై సమగ్ర శుభ్రత కార్యక్రమాలు నిర్వహించాలని, 21న విద్యార్థుల కోసం క్విజ్, డిబేట్, చిత్రలేఖనం వంటి టాలెంట్ ఫెస్ట్‌లు నిర్వహించాలని సూచించారు. 22న హాస్టళ్లలో మరమ్మతులు గుర్తించి వేసవి సెలవుల్లో పూర్తి చేయాలని, 23న తల్లిదండ్రులు–ఉపాధ్యాయుల సమావేశాలు నిర్వహించి ప్రతిభావంతులైన విద్యార్థులను సత్కరించాలని ఆదేశించారు. 24న నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, 25న క్రీడలు, కళలు, సంగీతం, డిజిటల్ లిటరసీతో సమ్మర్ క్యాంపులు, 26న రాష్ట్రవ్యాప్తంగా అన్ని హాస్టళ్లలో బడిబాట కార్యక్రమం నిర్వహించాలని తెలిపారు. ప్రతి కార్యక్రమంపై జిల్లా కలెక్టర్లు క్షుణ్ణంగా పర్యవేక్షించి సమగ్ర నివేదిక ప్రభుత్వానికి సమర్పించాలని సూచించారు. ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం పెంచడం ద్వారా పారదర్శకత, ప్రజా అవగాహన పెరుగుతుందని ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, సీఐపీఆర్ చి. ప్రియాంక తదితర అధికారులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థుల విద్యా హక్కుల పరిరక్షణకు ఏప్రిల్ 26న ఇందిరా పార్క్ వద్ద ధర్నా – తెలంగాణ రాజ్యాధికార పార్టీ పిలుపు




సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 19, ప్రతినిధి: పేద విద్యార్థుల విద్యా హక్కుల పరిరక్షణ కోసం తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 26న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు పార్టీ నేతలు తెలిపారు. రైట్ టు ఎడ్యుకేషన్ చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు ఉచితంగా కేటాయించాల్సిన నిబంధనను కచ్చితంగా అమలు చేయాలని, అలాగే ప్రతి సంవత్సరం అనియంత్రితంగా పెరుగుతున్న పాఠశాల ఫీజులను నియంత్రించాలని పార్టీ డిమాండ్ చేస్తోంది. ఈ సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈ ఆందోళన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. పేద ప్రజల పిల్లల భవిష్యత్తు కోసం విద్యా రంగంలో సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని పార్టీ నేతలు పేర్కొన్నారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



## పోసానిపేట జడ్పీ హైస్కూల్‌లో మీరాబాయి పదవీ విరమణ సభ ఘనంగా నిర్వహణ

సందేశం టైమ్స్, అందోల్, ఏప్రిల్ 19, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండలం పోసానిపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మీరాబాయి పదవీ విరమణ సందర్భంగా ఘనంగా అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగగా మండలంలోని పలు పాఠశాలల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినీలు పెద్ద సంఖ్యలో హాజరై ఆమె విద్యారంగానికి అందించిన సేవలను కొనియాడారు. గ్రామ ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, యువకులు కూడా పాల్గొని అభినందనలు తెలిపారు. విద్యార్థులు, విద్యార్థినీలు విశేషంగా హాజరై కార్యక్రమానికి ఉత్సాహాన్ని జోడించారు. మీరాబాయి సేవలు విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శకంగా నిలిచాయని పలువురు పేర్కొంటూ పదవీ విరమణ అనంతరం కూడా సమాజానికి సేవలు కొనసాగించాలని ఆకాంక్షించారు. కార్యక్రమాన్ని పాఠశాల సిబ్బంది సమర్థవంతంగా నిర్వహించారు.

## జోగిపేటలో మహిళా రిజర్వేషన్‌పై బీజేపీ ధర్నా



సందేశం టైమ్స్, అందోల్, ఏప్రిల్ 19, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండలం జోగిపేట పట్టణంలో లోకసభలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందకపోవడాన్ని వ్యతిరేకిస్తూ బీజేపీ నాయకులు హనుమాన్ మందిర్ చౌరస్తా వద్ద రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ బీజేపీ అధ్యక్షురాలు పావని మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందకపోవడానికి ప్రధాన ప్రతిపక్ష పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్ కారణమని ఆరోపించారు. మహిళల హక్కుల పరిరక్షణలో ఆ పార్టీలు విఫలమయ్యాయని విమర్శించారు. కార్యక్రమంలో కో-కన్వీనర్ సుమన్, వార్డ్ మెంబర్ వెంకటేశం, ప్రధాన కార్యదర్శి పాపయ్య, సీనియర్ నాయకులు మనయ్య, ప్రభాత్, అఖిల్, కిషన్ మెర్చా, నియోజకవర్గ ఇంచార్జ్ కడలా రాములు, కట్ట రవి రాజు, ఎర్ర వెంకట్, మహేందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు. మహిళా రిజర్వేషన్ ప్రాముఖ్యతను వివరించిన వారు రాబోయే ఎన్నికల్లో మహిళల సత్తా చాటుతామని హెచ్చరించారు.



## జహీరాబాద్‌లో బస్సులో డ్రగ్స్ రవాణా భగ్నం – 1.052 కిలోల చరస్ స్వాధీనం, నిందితుడు అరెస్ట్

సందేశం టైమ్స్, జహీరాబాద్, ఏప్రిల్ 19, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పరిసరాల్లో డ్రగ్స్ రవాణాపై ఎక్సైజ్ శాఖ పట్టు బిగించి చిరాగ్‌పల్లి చెక్‌పోస్ట్ వద్ద నిర్వహించిన తనిఖీల్లో గోవా నుంచి హైదరాబాద్‌కు బస్సులో అక్రమంగా నార్కోటిక్స్ తరలిస్తున్న ఘటనను బయటపెట్టింది. అనుమానాస్పదంగా ప్రయాణిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా 1.052 కిలోల చరస్ స్వాధీనం చేసుకున్నారు. ప్రయాణికుడిగా నటిస్తూ డ్రగ్స్ తరలిస్తున్నట్లు గుర్తించిన అధికారులు రాజస్థాన్‌కు చెందిన బుద్ధ రామ్‌ను అరెస్ట్ చేసి, అతని వద్ద ఉన్న మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. దాడుల్లో ఇన్‌స్పెక్టర్ టి. శ్రీనివాస్ రెడ్డి, ఎస్సైలు బి. కోటేశ్వర రావు, బి. రమేష్, పి. శాంత, హెడ్ కానిస్టేబుల్ జి. యర్రయ్య, కానిస్టేబుల్ ఎండి. యూనస్ పాల్గొన్నారు.

## ఆందోల్–జోగిపేటలో రూ.20 కోట్ల ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన



సందేశం టైమ్స్, అందోల్, ఏప్రిల్ 19, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా ఆందోల్–జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో రూ.20 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్‌కు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి, ఏఎంసీ చైర్మన్ రామ్ రెడ్డి, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జగన్మోహన్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సురేందర్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ చిట్టిబాబు, కౌన్సిలర్ మర్రి అరుణ కుమారి తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కాంప్లెక్స్ నిర్మాణంతో ప్రభుత్వ సేవలు ఒకే చోట అందుబాటులోకి రావడంతో ప్రజలకు సౌలభ్యం కలుగుతుందని తెలిపారు.



## అందోల్-జోగిపేటలో నూతన గ్రంథాలయం ప్రారంభం

సందేశం టైమ్స్, అందోల్, ఏప్రిల్ 19, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా అందోల్–జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో నూతనంగా నిర్మించిన గ్రంథాలయం మొదటి అంతస్తును రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి పి. దామోదర్ రాజనర్సింహ ఘనంగా ప్రారంభించారు. స్థానిక ప్రజల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. ఈ సందర్భంగా మున్సిపాలిటీ చైర్మన్ కృష్ణా రెడ్డి, వైస్ చైర్మన్ సత్యనారాయణ, జోగిపేట కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే పరిసర గ్రామాల ప్రజలు కూడా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ప్రారంభోత్సవం అనంతరం మంత్రి మాట్లాడుతూ గ్రంథాలయాల ప్రాముఖ్యతను వివరించి యువత చదువుపై ఆసక్తి పెంపొందించుకోవాలని, గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ గ్రంథాలయం ప్రారంభం వల్ల స్థానిక విద్యార్థులు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు ఉపయోగకరంగా ఉంటుందని నాయకులు అభిప్రాయం వ్యక్తం చేశారు.



## ఆందోల్‌లో మంత్రి దామోదర్ రాజనర్సింహ సుడిగాలి పర్యటన, పాలిటెక్నిక్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం

సందేశం టైమ్స్, అందోల్, ఏప్రిల్ 19, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా ఆందోల్ నియోజకవర్గంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ శనివారం సుడిగాలి పర్యటన నిర్వహించి చౌటకూర్ మండలం శివంపేట్, జోగిపేట పాలిటెక్నిక్ కళాశాలలో సుమారు రూ.75 లక్షల సిఎస్ఆర్ నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. న్యూల్యాండ్ ఫౌండేషన్ సిఎస్ఆర్ రూ.43 లక్షలతో నిర్మించిన మెకానికల్ వర్క్‌షాప్ షెడ్, డీఎంఎఫ్టీ రూ.6 లక్షలతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ ఎల్ఈడి స్ట్రీట్ లైట్లు, తోషిబా కంపెనీ సిఎస్ఆర్ రూ.26 లక్షలతో ఏర్పాటుచేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జోగిపేట పాలిటెక్నిక్‌కు ఇప్పటివరకు రూ.2.35 కోట్లకు పైగా సిఎస్ఆర్ నిధులు వినియోగించి అభివృద్ధి పనులు చేపట్టామని, రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి కాలేజీ అభివృద్ధికి కృషి చేస్తామని, గర్ల్స్ హాస్టల్ నిర్మాణంతో పాటు ఇతర వర్క్ షెడ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రావిణ్య, అదనపు కలెక్టర్ పాండు, సర్పంచ్ సంధ్యారాణి, న్యూల్యాండ్ ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ డివి రెడ్డి, ప్రజా ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## మియాపూర్‌లో ప్రణయ చిల్డ్రన్స్ క్లినిక్ ప్రారంభించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 19, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హైదరాబాద్ మియాపూర్‌లోని మాధవ్ నగర్‌లో ప్రణయ చిల్డ్రన్స్ క్లినిక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా క్లినిక్‌లో ఏర్పాటు చేసిన ఆధునిక వైద్య పరికరాలను పరిశీలించిన మంత్రి, తెలంగాణ ప్రభుత్వం విద్య, వైద్య రంగాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. హైదరాబాద్ నగరం హెల్త్ హబ్‌గా అభివృద్ధి చెందుతోందని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో సామాన్యులకు ఉచితంగా అత్యాధునిక వైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ రంగంలో వైద్య సౌకర్యాలను మరింత బలోపేతం చేస్తూ ప్రజలకు నాణ్యమైన చికిత్స అందించడమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ ప్రణయ, డాక్టర్ కె.వి. తేజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దేవర పబ్లిక్ స్కూల్‌లో యూకేజీ, 5వ తరగతి గ్రాడ్యుయేషన్ వేడుకలు ఘనంగా




సందేశం టైమ్స్, అందోల్, ఏప్రిల్ 19, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా అందోల్ మండలంలో దేవర పబ్లిక్ స్కూల్, అందోల్–జోగిపేట్‌లో యూకేజీ మరియు 5వ తరగతి విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ పి. బసవరాజ దేవర, కరస్పాండెంట్ పి. నట్రాజ్ దేవర పాల్గొనగా, ప్రిన్సిపాల్ పి. శ్రుతి విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత విద్యను అభ్యసించి తల్లిదండ్రులు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని యాజమాన్యం ఆకాంక్షించింది.

## సంక్షేమ వారోత్సవాలను సమన్వయంతో విజయవంతం చేయాలి: కలెక్టర్ ప్రావీణ్య



సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 19, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లాలో ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 20 నుంచి 26 వరకు నిర్వహించనున్న సంక్షేమ వారోత్సవాలను ప్రణాళికాబద్ధంగా, సమన్వయంతో ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నుండి సీఎస్ రామకృష్ణారావు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ప్రతి రోజు షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు నిర్వహించి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు ప్రజలకు విస్తృతంగా చేర్చాలని తెలిపారు. వసతి గృహ విద్యార్థులకు క్విజ్, ఉపన్యాసాలు, చిత్రలేఖనం, క్రీడా పోటీలు నిర్వహించి ప్రతిభావంతులకు బహుమతులు అందజేయాలని, హాస్టళ్లలో మరమ్మతులను వెంటనే చేపట్టాలని సూచించారు. యువతకు ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, కెరీర్ మార్గదర్శకంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు, వ్యక్తిత్వ వికాస శిక్షణలు నిర్వహించాలని ఆదేశించారు. ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను వేగవంతం చేసి అర్హులైన ప్రతి రైతు నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్ మండలాల ప్రత్యేక అధికారులు, శాఖల సమన్వయంతో కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని, ప్రతి కార్యక్రమంపై ప్రజలకు స్పష్టమైన సమాచారం అందేలా చూడాలని సూచించారు. పేరెంట్స్ మీటింగ్‌ల ద్వారా వసతి గృహాల్లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, పోషకాహారం, విద్యా అవకాశాలపై అవగాహన కల్పించాలని, కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ పాండు సహా వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## భూగర్భ ఆస్తులకు నష్టం కలగకుండా పటిష్ట చర్యలు: కలెక్టర్ ప్రతిమాసింగ్

సందేశం టైమ్స్, మెదక్, ఏప్రిల్ 19, ప్రతినిధి: మెదక్ జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో శనివారం విద్యుత్, నీటిపారుదల, టెలికాం, టి ఫైబర్, గ్రామపంచాయతీ, ఆర్ అండ్ బి, మిషన్ భగీరథ తదితర శాఖల అధికారులతో భూగర్భ ఆస్తులకు నష్టం కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ ప్రతిమాసింగ్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తవ్వకాలు చేపట్టే ముందు సీబీయూడీ యాప్‌లో నమోదు చేసుకోవాలని, తవ్వకం ప్రదేశానికి సంబంధించిన ముందస్తు సమాచారం సంబంధిత అధికారులకు అందించాలని సూచించారు. భూగర్భ సదుపాయాల వివరాలు ముందుగానే తెలుసుకొని ఫైబర్ కేబుల్స్, గ్యాస్ పైపులు, నీటి లైన్లు వంటి వాటికి నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జీపీఆర్ వంటి సాంకేతికతతో భూగర్భ యుటిలిటీ మ్యాపింగ్ చేయడం, సంబంధిత శాఖల నుంచి అనుమతులు పొందడం తప్పనిసరని, యంత్రాలను వినియోగించే ముందు అనుమానం ఉన్న ప్రదేశాల్లో చేతితో జాగ్రత్తగా తవ్వాలని సూచించారు. నిపుణులైన ఇంజనీర్ల పర్యవేక్షణలో పనులు నిర్వహించడం, హెచ్చరిక బోర్డులు, బారికేడ్లు ఏర్పాటు చేయడం ద్వారా అప్రమత్తత పాటించాలని చెప్పారు. చట్టపరమైన నిబంధనలు పాటిస్తూ ప్రజల భద్రతతో పాటు ప్రభుత్వ ఆస్తులను కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, డీపీవో యాదయ్య, జిల్లా అటవీ అధికారి జోజి, ఈడీఎం సందీప్, టి ఫైబర్ అధికారులు ఈశ్వర్, అవినాష్, రామ్, మిషన్ భగీరథ అధికారి సంపత్, గ్రిడ్ అధికారి నాగభూషణం, ఆర్ అండ్ బి ఈఈ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.




## నేరడలో దేవాలయ ప్రతిష్ట కార్యక్రమానికి పోలీస్ అధికారికి ఆహ్వానం

సందేశం టైమ్స్, చింతకాని, ఏప్రిల్ 19, ప్రతినిధి: ఖమ్మం జిల్లా చింతకాని మండలం నేరడ గ్రామంలో ఈనెల 23-04-2026 గురువారం ఉదయం 10:53 గంటలకు నిర్వహించనున్న శ్రీ సీతారామచంద్రస్వామి, శ్రీ వేణుగోపాల స్వామి, శ్రీ వెంకటేశ్వర స్వామి విగ్రహ ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమానికి చింతకాని ఎస్ఐను గ్రామ ప్రజల తరఫున భక్తబృందం, గ్రామ సర్పంచ్ ఆహ్వాన పత్రిక అందజేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమం విజయవంతం కావాలని గ్రామస్తులు ఆకాంక్షించారు.

## బొడ్మట్‌పల్లి చౌరస్తాలో చలివేంద్రం ప్రారంభం



సందేశం టైమ్స్, మెదక్, ఏప్రిల్ 19, ప్రతినిధి: మెదక్ జిల్లా టేక్మాల్ మండలం బొడ్మట్‌పల్లి గ్రామ చౌరస్తాలో సర్పంచ్ తలారి అవినాష్ కుమార్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించారు. వేసవి కాలంలో ప్రయాణికుల దాహార్తిని తీర్చడానికి ఈ చలివేంద్రం ఉపయోగపడుతుందని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మౌనిక, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శంకరప్ప, ఉప సర్పంచ్ మాధవి, నాగభూషణం, వార్డు సభ్యులు శ్రీశైలం, పెంటయ్య, నర్సింలు, అందోలు విఠల్, గతంగారి ఈశ్వరప్ప, పాండు, సత్యం, అబ్బాస్, పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.




## 7 రోజుల సంక్షేమ వారాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి: సీఎస్ రామకృష్ణారావు

సందేశం టైమ్స్, మెదక్, ఏప్రిల్ 19, ప్రతినిధి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈనెల 20 నుంచి 26 వరకు నిర్వహించనున్న 7 రోజుల సంక్షేమ వారాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు తెలిపారు. శనివారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంక్షేమ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వసతి గృహాలు, గురుకుల, ఆశ్రమ పాఠశాలల్లో పారిశుధ్య పనులు చేపట్టడం, విద్యార్థులకు క్విజ్, చిత్రలేఖనం, పెయింటింగ్ పోటీలు నిర్వహించడం, మరమ్మత్తు పనులు చేపట్టడం, తల్లిదండ్రులు–ఉపాధ్యాయులతో సమావేశాలు ఏర్పాటు చేయాలని సూచించారు. స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలు, వేసవి శిబిరాలు, బడిబాట కార్యక్రమాలు నిర్వహించి రైతు రిజిస్ట్రీని 100 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో గురుకులాలు, వసతి గృహాల్లో పారిశుధ్య, మరమ్మత్తు పనులు చేపట్టి విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహిస్తామని, స్కిల్ డెవలప్మెంట్, తల్లిదండ్రులు–ఉపాధ్యాయుల సమావేశాలు, వేసవి శిబిరాలు సమన్వయంతో అమలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సీపీఓ సురేష్, గృహ నిర్మాణ శాఖాధికారి మాణిక్యం, డిడబ్ల్యూఓ హేమభార్గవి, గిరిజన సంక్షేమ అధికారి నీలిమ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై అవగాహనకు 'ఇంటికి చేరాలి' షార్ట్ ఫిల్మ్ ప్రారంభం



సందేశం టైమ్స్, మెదక్, ఏప్రిల్ 19, ప్రతినిధి: మెదక్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాలను తగ్గించడం, యువతలో రహదారి భద్రతపై అవగాహన పెంపొందించడం లక్ష్యంగా కొనసాగుతున్న 99 రోజుల 'సురక్షిత ప్రయాణం (Arrive Alive)' కార్యక్రమంలో భాగంగా Project ABC 3.0 కింద రూపొందించిన 'ఇంటికి చేరాలి' అనే షార్ట్ ఫిల్మ్‌ను జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ షార్ట్ ఫిల్మ్ ద్వారా హెల్మెట్ ధరించడం ఒక ఎంపిక కాకుండా ప్రాణ రక్షణకు అవసరమని స్పష్టమైన సందేశాన్ని ప్రజలకు, ముఖ్యంగా యువతకు అందించారు. ట్రాఫిక్ నియమాలను నిర్లక్ష్యం చేస్తూ జరిమానాలను ప్రతికూలంగా భావించే యువతకు పోలీసులు విధించే జరిమానాలు శిక్ష కోసం కాకుండా ప్రజల ప్రాణాలను కాపాడేందుకు తీసుకునే రక్షణ చర్యలేనని ఈ చిత్రం ద్వారా తెలియజేశారు. ఒక చిన్న నిర్లక్ష్యం జీవితాంతం బాధకు దారి తీస్తుందని, హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చని ఈ షార్ట్ ఫిల్మ్‌లో ప్రతిబింబించారు. ఇందులో మహిళా, శిశు సంక్షేమ శాఖ సిబ్బంది, ఉమ్మడి జిల్లా ఎన్-6 స్టాఫ్ రిపోర్టర్ మధు నటించగా, కాన్సెప్ట్, స్క్రిప్ట్, ఎడిటింగ్ కూరపాటి సునీత రాకేష్ నిర్వహించారు. జిల్లా ప్రజలు ముఖ్యంగా యువత ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించి హెల్మెట్ ధరించి సురక్షితంగా ఇంటికి చేరాలని జిల్లా పోలీస్ శాఖ విజ్ఞప్తి చేసింది.

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి: డీఈఓ విజయ




సందేశం టైమ్స్, మెదక్, ఏప్రిల్ 19, ప్రతినిధి: మెదక్ జిల్లా హవేలీ ఘనపూర్ మండల పరిధిలోని కూచన్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా బడిబాట కార్యక్రమాన్ని జిల్లా విద్యాధికారిణి విజయ ముఖ్య అతిథిగా హాజరై నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బడీడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని, ప్రభుత్వ పాఠశాలలో సకల వసతులు అందుబాటులో ఉన్నాయని, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తల్లిదండ్రులు, యువత, గ్రామ పెద్దలు సహకరించాలని, గ్రామంలోని విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలని పిలుపునిచ్చారు. మండల విద్యాధికారి నాచారం మధుమోహన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో గ్రంథాలయాలు, సైన్స్ ల్యాబులు, కరాటే, యోగా వంటి సదుపాయాలు ఉన్నాయని, ప్రత్యేక కోచింగ్ ద్వారా విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. అనంతరం విద్యార్థులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించి బడిబాట కరపత్రాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా సీఎంఓ అధికారి రాజు, ఉపాధ్యాయులు శివరాజ్, మల్లారెడ్డి, శ్రీనివాస్, శశికుమార్, ఎల్లంరాజు, సంతోషి కుమారి, కృష్ణవేణి, విమల, గంగమణి, స్వప్న, రాజేందర్ రెడ్డి, చక్రపాణి, శశికుమార్ రెడ్డి, సందీప్, కృష్ణ, త్యార్ల శ్రీనివాస్ తదితరులు, ప్రజా ప్రతినిధులు, గ్రామ యువత, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## అమీన్పూర్‌లో ఎస్టీపీపై ప్రజాభిప్రాయం మేరకు నిర్ణయం: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

సందేశం టైమ్స్, పటాన్‌చెరు, ఏప్రిల్ 19, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం అమీన్పూర్ డివిజన్‌లో ప్రతిపాదించిన శివరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ (ఎస్టీపీ)పై ప్రజల అభిప్రాయమే తుది నిర్ణయమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శనివారం 993 సర్వే నంబర్‌లో ఏర్పాటు చేయనున్న ప్లాంట్ స్థలంలో స్థానికులతో సమావేశమై మాట్లాడిన ఆయన, అమీన్పూర్ వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో మురుగునీటిని శుద్ధి చేయాలనే ఉద్దేశంతో కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్ట్‌ను ప్రతిపాదించామని చెప్పారు. అయితే ప్లాంట్ వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయనే ఆందోళనలతో స్థానిక ప్రజలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో మెజారిటీ ప్రజల అభిప్రాయానికి అనుగుణంగా ఎస్టీపీని తరలించడం లేదా రద్దు చేయడం గురించి ప్రభుత్వంతో చర్చిస్తామని తెలిపారు. అవసరమైతే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని పేర్కొంటూ, ప్రస్తుతం పనులను తక్షణమే నిలిపివేయాలని అధికారులకు, కాంట్రాక్టర్లకు ఆదేశించినట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో అమీన్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, జలమండలి అధికారులు పద్మజ, సుబ్బరాయుడు తదితరులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## దయారా మెడికల్ డివైజ్ పార్కులో అగ్ని ప్రమాదం

సందేశం టైమ్స్, పటాన్‌చెరు, ఏప్రిల్ 19, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం అమీన్పూర్ పరిధిలోని దయారా మెడికల్ డివైజ్ పార్కులో అగ్ని ప్రమాదం సంభవించింది. యాష్ అనే కంపెనీలో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ కమ్ముకుంది. ప్రమాదం కారణంగా కార్మికులు భయంతో బయటకు పరుగులు తీశారు. స్థానికుల సమాచారంతో ఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టారు. ఈ సంస్థలో సుమారు 2000 మంది కార్మికులు పనిచేస్తున్నట్లు సమాచారం. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



## శ్రీనగర్ కాలనీలో అయ్యప్ప దేవాలయ 18వ వార్షికోత్సవం పాల్గొన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

సందేశం టైమ్స్, పటాన్‌చెరు, ఏప్రిల్ 19, ప్రతినిధి: పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని శ్రీనగర్ కాలనీలో గల శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయం 18వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ అప్పన్న దేవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, నర్రా బిక్షపతి, సంజీవరెడ్డి, నరసింహారెడ్డి, ప్రకాష్ రావు, మాలిక్ ప్రభు, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు. వార్షికోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధలతో, ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు.

## సూర్యాపేట జిల్లాలో అభివృద్ధి పనుల వేగవంతం – పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం, ధాన్యం కొనుగోలు ప్రక్రియపై కలెక్టర్ ఆదేశాలు






సందేశం టైమ్స్, సూర్యాపేట, ఏప్రిల్ 19, ప్రతినిధి: సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా ప్రజా సేవలు, వ్యవసాయ రంగం, పరిపాలనా పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. 99 రోజుల ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా శనివారం నూతనకల్ తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన, పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, సాదా బైనామా, క్రమబద్ధీకరణ ఫైళ్లను పారదర్శకంగా పూర్తి చేసి భూభారతి చట్టం–2025 మరియు సంబంధిత జీవోల ప్రకారం రైతులకు పట్టాలు మంజూరు చేయాలని సూచించారు. సర్వే, రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేసి అర్హులైన రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అదే సమయంలో జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్, 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా 340 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కొనుగోలు కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు కల్పించి, తేమ కొలిచే యంత్రాలు, టార్పాలిన్లు, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, రోజుకు 5 నుండి 6 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పని చేయాలని ఆదేశించారు. అకాల వర్షాల దృష్ట్యా రైతులకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమాల్లో తహసిల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో సునీత, సివిల్ సప్లయ్, వ్యవసాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## సూర్యాపేట జిల్లాలో హౌస్ లిస్టింగ్, T-Hub సేవల సమీక్ష – పకడ్బందీ అమలుకు కలెక్టర్ ఆదేశాలు

సందేశం టైమ్స్, సూర్యాపేట, ఏప్రిల్ 19, ప్రతినిధి: సూర్యాపేట జిల్లాలో జన గణన 2027 కార్యక్రమం భాగంగా హౌస్ లిస్టింగ్ ప్రక్రియను సమర్థవంతంగా, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. నూతనకల్ జడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన మొదటి విడత శిక్షణా కార్యక్రమానికి హాజరైన ఆయన, న్యూమరేటర్లు, సూపర్వైజర్లు ప్రతి ఇంటిని తప్పకుండా నమోదు చేయాలని, ఏ గృహం కూడా వదిలిపెట్టకుండా వీధి చివరి నుండి చివరి వరకు సమగ్రంగా హౌస్ లిస్టింగ్ చేయాలని సూచించారు. CMMS పోర్టల్ ద్వారా మొబైల్ అప్లికేషన్‌లో నమోదు తప్పనిసరిగా చేయాలని పేర్కొన్నారు. అనంతరం ఆశా వర్కర్లతో మాట్లాడి గ్రామ ఆరోగ్య పరిస్థితులను తెలుసుకొని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. అదే రోజు కలెక్టరేట్‌లో నిర్వహించిన T-Hub సేవల సమీక్ష సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, రక్త పరీక్షల నిర్వహణలో నాణ్యత, ఖచ్చితత్వం, సమయపాలన పాటించాలని ఆదేశించారు. GGH సూర్యాపేట, AH కోదాడ, పీహెచ్‌సీలు నేరేడుచెర్ల, గరిడేపల్లి పరిధిలో సేకరించిన నమూనాలు ఎక్కువగా తిరస్కరణకు గురవుతున్న కారణాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని సూచించారు. ప్రతి రోజు సుమారు 1500 మందికి 5500కు పైగా పరీక్ష ఫలితాలు అందుతున్నాయని పేర్కొంటూ, మౌలిక వసతుల మెరుగుదలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో సంబంధిత వైద్యాధికారులు, డీఎంహెచ్ఓ డాక్టర్ పెండెం వెంకట రమణ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సంక్షేమ వారాన్ని పకడ్బందీగా నిర్వహించాలి: సీఎస్ రామకృష్ణారావు




సందేశం టైమ్స్, సూర్యాపేట, ఏప్రిల్ 19, ప్రతినిధి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 20 నుంచి 26 వరకు నిర్వహించనున్న సంక్షేమ వారాన్ని పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులతో కలిసి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంక్షేమ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ వసతి గృహాలు, గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లో పారిశుధ్య పనులు చేపట్టడంతో పాటు విద్యార్థులకు క్విజ్, చిత్రలేఖనం, పెయింటింగ్ పోటీలు నిర్వహించాలని, మరమ్మతు పనులు చేయాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశాలు నిర్వహించి వసతులపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. స్కిల్ డెవలప్మెంట్, వేసవి శిబిరాలు, బడిబాట కార్యక్రమాలు నిర్వహించి రైతు రిజిస్ట్రీని 100 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని రెసిడెన్షియల్ విద్యాలయాలు, హాస్టళ్లలో ప్రత్యేక అధికారులు సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాలు, వసతి గృహాల్లో పారిశుధ్యం, వంటగది, మరమ్మతు పనులు చేపట్టడంతో పాటు విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కే. సీతారామారావు, జడ్పీ సీఈఓ శిరీష, డీపీఓ యాదగిరి, డీఈఓ అశోక్, సంక్షేమ శాఖ అధికారులు దయానందరాణి, నరసింహ, శంకర్, పీడీ హౌసింగ్ సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

## అనంతగిరిలో కత్రం చారిటబుల్ ఫౌండేషన్ కబడ్డీ లీగ్ – గోల్ తండా విజేతగా నిలిచింది




సందేశం టైమ్స్, అనంతగిరి, ఏప్రిల్ 19, ప్రతినిధి: కత్రం చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కత్రం కబడ్డీ లీగ్ మండల స్థాయి పోటీలు అనంతగిరి మండలంలో ఘనంగా కొనసాగుతున్నాయి. తొలివిడత పోటీల్లో ఖానాపురం గ్రామంలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఖానాపురం, గోల్ తండా జట్ల మధ్య హోరాహోరీ పోరు సాగగా గోల్ తండా జట్టు విజేతగా నిలిచింది. విజేత జట్టుకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. అనంతగిరి మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను కోదాడ నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. లీగ్ షెడ్యూల్ ప్రకారం ఈ నెల 20, 21 తేదీల్లో నడిగూడెం, మోతే మండలాల పోటీలు, 24, 25 తేదీల్లో మునగాల, చిలుకూరు మండలాల పోటీలు, 27న కోదాడ మున్సిపాలిటీ స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మండల స్థాయి పోటీలు పూర్తయ్యాక ఎంపికైన 14 జట్లతో మే 4, 5 తేదీల్లో కోదాడలో నియోజకవర్గ స్థాయి పోటీలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో కత్రం చారిటబుల్ ఫౌండేషన్ కన్వీనర్ ముడియాల సత్యనారాయణ రెడ్డి, ఖానాపురం సర్పంచ్ లాజర్, వైస్ సర్పంచ్ జగ్గయ్య, కాంగ్రెస్ నాయకులు రఘు, టీడీపీ మండల అధ్యక్షులు చాపల శ్రీను, సుంకరి పుల్లారావు, కోచ్ వీనేపల్లి శ్రీనివాసరావు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times,(పబ్లికేషన్: అమృత వెంకట్ మీడియా పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్.) ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.